క్లుప్తంగా

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



శ్రీరామ్ మాస్టారును శాలువా కప్పి సత్కరిస్తున్న జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి

ఉంగుటూరు: అంకితభావంతో పని చేస్తే గుర్తింపు తప్పక వస్తుందని దీనికి శ్రీరామ్ మాస్టారు ఉదాహరణ అని ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం కై కరం జిల్లా పరిషత్ హైస్కూల్లో సుదీర్ఘకాలం భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేసిన సత్తిరాజు శ్రీరామ్ మాస్టారు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ శ్రీరామ్ మాస్టారు వృత్తిపట్ల అంకితభావంతో పని చేశారని కొనియాడారు. సమావేశానికి హెచ్ఎం ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి, కైకరం కాంప్లెక్సు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థులపాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు ప్రశంసనీయం



భీమడోలులో ప్రిన్సిపల్ నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమడోలు: అధ్యాపక వృత్తిని అంకితభావంతో, సమర్థవంతంగా నిర్వర్తించిన వంగా నాగేశ్వరరావు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వంగా నాగేశ్వరరావు పదవీ విరమణ అభినందన కార్యక్రమం శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా నాగేశ్వరరావు దంపతులను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాగేశ్వరరావు సేవలను నేటి అధ్యాపకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వంగా నాగేశ్వరరావు పదవీ విరమణతో కళాశాల గణిత అధ్యాపకురాలు ఏ.మాధవి ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, రిటైర్డ్ లెక్చరర్ ఈతకోట సుబ్బారావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఆదాయం దిశగా పొలంబడి సాగాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శనివారం ఉంగుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో వ్యవసాయ శాఖ పొలంబడి పోస్టరును ధర్మరాజు ఆవిష్కరించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలంబడి నిర్వహించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం సచివాలయ ఉద్యోగులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. అనంతరం ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ

దెందులూరు: త్వరలో అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం పెన్షన్ నగదును లబ్ధిదారులకు ఆయన గోపన్నపాలెం, సోమవరప్పాడు, కొవ్వలి, గాలాయగూడెం గ్రామాల్లో పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ వీ.శ్రీలత, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), నాయకులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శనివారపుపేటలోని హజరత్ సయ్యద్ జమాల్ షా ఖాదరీ వలి మహాత్ముని ఉరుసు ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంగర్ ఖానీ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నాత్ ఖానీ (దీపారాధన) చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దర్గా వంశపారంపర్య ముజావర్లు మహమ్మద్ అన్వర్ షరీఫ్, మహబూబ్ షరీఫ్, అమీర్‌జాన్ జాఫర్ షరీఫ్ పర్యవేక్షించారు.

భారీవర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- డ్రెయిన్ల ఆక్రమణల నేపథ్యంతో నీరంతా రోడ్లపైనే
- పాఠశాలలకు సెలవు ప్రకటించిన విద్యాశాఖ



భీమడోలు : జాతీయ రహదారి భీమడోలు జంక్షన్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షం నీరు



భీమడోలు : స్థానిక ఉన్నత పాఠశాల ఉన్నత పాఠశాల ప్రధాన రహదారి



గణపవరం: వర్షాలకు బురదమయంగా మారిన రోడ్డు

గణపవరం: రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్ర, శనివారాల్లో విరామం లేకుండా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. దీనితో రోడ్లు బురదమయంగా మారాయి. గ్రామాల్లో డ్రెయినేజీలు పొంగి రోడ్ల మీదికి మురుగునీరు ప్రవహించడంతో పారిశుద్ధ్యం క్షీణించింది. పంట, మురుగు కాలువలు నిండుకుండల్లా గట్లకు సరాసరి ప్రవహిస్తున్నాయి. రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడి వర్షం కురియడంతో ఆక్వా సాగుకు ముప్పుగా మారింది. గ్రామాల్లోని మట్టి, గ్రావెల్ రోడ్లు బురదమయంగా మారి కనీసం నడవడానికి కూడా వీలులేని విధంగా తయారయ్యాయి. విడవకుండా కురుస్తున్న వర్షాలకు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు అమ్మకాలులేక ఇబ్బంది పడ్డారు.

దంచికొడుతున్న వానలు

భీమడోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి విద్యాశాఖ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించింది. తుఫాన్‌గా మారి మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మండల వ్యాప్తంగా రెండు రోజులుగా 92.42 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీనితో మండల వ్యాప్తంగా పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో నుంచి ముంపు నీరు కిందకు చేరడం, భీమడోలు జంక్షన్ ప్రాంతంలో ఆక్రమణల నేపథ్యం కిందకు వెళ్లే మార్గం లేక నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనితో రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధాన రోడ్డుపై మోకాలు లోతు నీరు చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఆటంకంగా మారింది. మురుగు డ్రెయిన్ లేనందున వర్షపు నీరు పాఠశాల రోడ్డపైనే ఉంటోంది. భీమడోలులోని పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు నీట మునిగింది. డ్రెయిన్లు పూడిక తీయకపోవడంతో వర్షం నీటితో మురుగు కలిసి రోడ్డుపై ప్రవహిస్తోంది. భీమడోలు, గుండుగొలను, సాయన్నపాలెం, ఎంఎంపురం గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోని వరి చేలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి నష్టం లేదని సంబంధిత అధికారులు అంటున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని, అన్ని శాఖల గ్రామస్థాయి ఉద్యోగులు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండలస్థాయి అధికారులకు తెలియజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఉంగుటూరులో ఏకధాటిగా వర్షం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి వర్షం కురుస్తానే ఉంది. శనివారం 58.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దాంతో గ్రామాల్లోని లోతట్టు వీధులు, గ్రావెల్, మట్టి రహదార్లు అస్తవ్యస్తంగా మారాయి. ఏలూరు కాలువ, డ్రెయిన్లు నిండా ప్రవహిస్తున్నాయి. ఇన్‌ఛార్జి తహసీల్దారు బొద్దేపల్లి ప్రసాదు మండలంలోని పరిస్థితి సమీక్షిస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లి పరిశీలించి గ్రామ రెవెన్యూ అధికారులను చైతన్యపర్చినట్లు ఆయన తెలిపారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలియజేయాలని వారికి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని తెలిపారు. మరో 24 గంటల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇళ్లల్లోకి వర్షపు నీరు

దెందులూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మసీదుపాడులో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. దోసపాడులో సైతం వర్షపునీరు వాకిట్లోకి చేరింది. శనివారం రాత్రికి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీరు వస్తే గుండేరువాగు ఉధృతి ఏరకంగా ఉంటుందోనని అధికారులు అంచనా వేస్తున్నారు. కొవ్వలి మొండుకోడు, గుండేరువాగు వల్ల వర్షపునీరు అధికంగా పెరిగితే ఈ వాగుల వల్ల రాకపోకలు నిలిచిపోవడం, భారీగా వర్షపు నీరు ప్రవహిస్తే ప్రమాదం ఎక్కువయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



దెందులూరు: మసీదుపాడులో ముంపుబారిన చర్చి



దెందులూరు: మసీదుపాడులో ఇళ్ల వద్దకు చేరిన వర్షపునీరు



భీమడోలు: స్థానిక పంచాయతీ కార్యాలయం రోడ్డుపై వర్షపు నీరు



పెదపాడు: కొత్తూరులో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు



పెదపాడు: వట్లూరు-పెదపాడు రోడ్డులో కాజ్‌వేపై పొంగి ప్రవహిస్తున్న నీరు

ముంపు ప్రాంతాల్లో అధికారుల పరిశీలన





పెదపాడు: గోగుంటలో ముంపు బారిన పడిన ఎస్సీ కాలనీని పరిశీలిస్తున్న అధికారులు

పెదపాడు: వాతావరణ మార్పుల కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పెదపాడు మండలంలోని కొత్తూరులో పెదపాడు- ఏలూరు రహదారిపై భారీ వృక్షం నేల కొరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వెంటనే అధికారులు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తక్షణ చర్యలు చేపట్టి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. పెదపాడు వట్లూరు రహదారిపై ఉన్న కాజ్‌వేపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని ఎవరూ రహదారిపై రాకపోకలు సాగించవద్దని రెవెన్యూ అధికారులు ప్రజలకు సూచించారు. రహదారికి అడ్డంగా ముళ్ల కంచెలు వేశారు. గోగుంటలోని ఎస్సీ ఏరియా నీట మునిగింది. దీంతో తహసీల్దార్ ఎన్‌వీడీవీ ప్రసాదరావు సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పునరావాసం ఏర్పాటు చేసి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామ రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆదేశించారు. పెదపాడు మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది కలిగినా 9966999684 నంబరును సంప్రదించాలని తహసీల్దార్ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



ఉండ్రాజవరంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చుక్కా అవినాష్ రాజు

దెందులూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి మార్గదర్శకులని, చరిత్ర ఉన్నంతకాలం ఆయన కీర్తిప్రతిష్టలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని లయన్స్ క్లబ్ డైరెక్టర్ చుక్కా అవినాష్‌రాజు అన్నారు. శనివారం ఉండ్రాజవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ పోతునూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు సున్నా ఆశీర్వాదం విగ్రహాన్ని బహూకరించగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, ఉండ్రాజవరం గ్రామస్తులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జరజాపు రంగారావు రెయిలింగ్ నిమిత్తం రూ.40 వేలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు బీవీ రమణమూర్తి, లయన్స్ క్లబ్ నాయకులు రంగారావు, శరీష్, ఎంపీటీసీ సున్నా నరేష్ అన్నారు. ఉండ్రాజవరం గ్రామస్తులు దాతలను అభినందించారు.

ప్రజలంతా కలిసి మెలిసి ఉంటేనే అభివృద్ధి



ముప్పర్తిపాడులో పౌరహక్కుల సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: గ్రామంలోని ప్రజలంతా కలిసి మెలిసి అన్నదమ్ముల వలే ఉంటేనే గ్రామాభివృద్ధి వేగవంతమవుతుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సెల్ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. శనివారం గణపవరం మండలం ముప్పర్తిపాడులో పౌరహక్కుల దినోత్సవం తహసీల్దార్ వీఎస్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ప్రతినెలా 30వ లేదా 31వ తేదీల్లో ఏదో ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు కులరహిత సమాజస్థాపనపై అవగాహన కల్పించాలని సూచించారు. కుల వివక్ష చూపడం నేరమని, ఎస్సీ, ఎస్టీలను కులంపేరుతో దూషిస్తే శిక్షార్హమని అన్నారు. సమాజంలో అన్ని కులాలు ఐకమత్యంగా ఉంటే శాంతియుత జీవనం గడపవచ్చునన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

దెందులూరులో సివిల్ రైట్స్ డే

దెందులూరు: ప్రతి ఒక్కరూ తన హక్కులను పరిరక్షించుకునేందుకు చట్టాలు, రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని దెందులూరు తహసీల్దార్ వీ.సుమతి, ఎస్సై కే.స్వామి అన్నారు. శనివారం సాయంత్రం దెందులూరు ఎస్ఎంఆర్ సచివాలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఎంపీడీఓ వీ.శ్రీలత, గ్రామస్తులు ఉన్నారు.

నేషనల్ హైవేపై అధికారుల నిర్లక్ష్యం



జాతీయరహదారిపై సిగ్నల్ స్థానంలో ప్లాస్టిక్ డివైడర్‌ను ఏర్పాటు చేసిన దృశ్యం

దెందులూరు: విజయవాడ- రాజమండ్రి నేషనల్ హైవే 24 గంటలూ రద్దీగా ఉండే రహదారి. ప్రతిరోజూ రెండువైపులా లక్షలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. మండలంలోని గుండుగొలను వంతెన సమీపంలో డబుల్ రోడ్డు వద్ద సిగ్నల్ ఏర్పాటు చేయాల్సిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్అండ్‌బీ అధికారులు ప్లాస్టిక్ డివైడర్‌ను పెట్టి చేతులు దులుపుకున్నారు. గరుడ హోటల్ నుంచి గుండుగొలను వంతెన సమీపంలో ఏడాది లోపు అనేక ప్రమాదాలు చోటుచేసుకుని అనేక మంది మరణాలు కోల్పోయారు. రాత్రివేళల్లో అయితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఇక్కడ నెలకొంది. సిగ్నల్ లేక తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే గరుడ హోటల్‌కు ముందు రెండు వైపులా సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వృద్ధురాలు సొమ్ము అపహరణ

ఏలూరు టౌన్: వృద్ధురాలి సొమ్మును అపరిచిత వ్యక్తి ఏటీఎం సెంటర్‌లో కాజేశాడు. ఏటీఎం సెంటర్లో సొమ్ము డ్రా చేసుకోవడానికి వెళ్లిన వృద్ధురాలిని ఆ వ్యక్తి మోసగించి కార్డు అపహరించి రూ.20 వేల నగదు డ్రా చేసుకున్నాడు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మేరుగు కాంతమ్మ (60) వట్లూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పక్కనే ఉన్న ఏటీఎంకు డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్లింది. అక్కడే గుర్తు తెలియని వ్యక్తి ఉండడంతో సొమ్ములు డ్రా చేసి ఇమ్మని కోరింది. అతను డబ్బులు డ్రా చేసి ఇచ్చి ఆ కార్డును మార్చేశాడు. అనంతరం వృద్ధురాలి కార్డులోని రూ.20 వేల నగదు అపహరించాడు. బాధితురాలు త్రీ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో బంగారు నగలు మాయం

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో ఇంట్లోని బంగారు నగలు మాయం అయ్యాయి. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం. తంగెళ్లమూడి నేతాజీనగర్‌లోని ఒక అపార్టుమెంటులో నివాసముంటున్న చిన్నం విజయ భాస్కర్‌రావు శనివారం తన భార్యతో కలిసి ఆసుపత్రికి వెళ్లారు. ఇంటి నుంచి బయటకెళ్లే సమయానికి పనిమనిషి రావటంతో ఇంటికి తాళం వేయకుండా ఆమెకు అప్పగించారు. ఆమె ఇంట్లో పనులు ముగించుకున్న అనంతరం తలుపుకు తాళం వేసి అపార్టుమెంటు వాచ్‌మెన్ భార్యకు తాళాలు ఇచ్చి వెళ్లిపోయింది. ఆసుపత్రిలో చూపించుకుని తిరిగి విజయభాస్కరరావు దంపతులు ఇంటికి వచ్చి తాళం తీసుకుని లోపలకు వెళ్లారు. ఇంట్లో బీరువాలో ఉన్న మూడున్నర కాసుల బంగారు నగలు కనిపించలేదు. విజయభాస్కరరావు రూరల్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయటంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

వనమహోత్సవం నిరంతరం కొనసాగాలి

దెందులూరు: వనమహోత్సవం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, మొక్క నాటినవారు వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపడితేనే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని దెందులూరు ఇండియన్ బ్యాంకు మేనేజర్ సీజేఎస్ లక్ష్మి దుర్గ అన్నారు. శనివారం ఇండియన్ బ్యాంక్ స్టాఫ్, నర్సింగ్ కళాశాల స్టాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో దెందులూరులో రోడ్డుకిరువైపులా, సచివాల యం, నర్సింగ్ కళాశాలలో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో బ్యాంకు స్టాఫ్ సునీత, అనిల్‌కుమార్, రామకృష్ణ, నారాయణ, నర్సింగ్ విద్యార్థులతో, కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు ప్రతిజ్ఞ చేయించారు.

దెందులూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

దెందులూరు: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్. కృపావరం అన్నారు. శనివారం ఉదయం తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ వి.శ్రీలత, మండలాధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో భారీ వర్షాలు, లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు గ్రామ స్థాయి ఉద్యోగులకు డ్యూటీల ఏర్పాటు, జేసీబీల సంసిద్ధత, విద్యుత్ సమస్యలపై శాఖల వారీగా, గ్రామాల వారీగా సమీక్షించారు. మూడు రోజులు పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులను రద్దు చేశారు. గుండేరు, మొండుకోడు డ్రెయిన్ల వద్ద నిఘాను కట్టుదిట్టం చేశారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు, ఉద్యోగులు జిల్లా అధికారులకు వర్షం పరిస్థితులు తెలియజేయాలన్నారు.

జ్వరాలను అశ్రద్ధ చేయొద్దు



చేబ్రోలు బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు

ఉంగుటూరు: జ్వరాలు పట్ల అశ్రద్ధ చేయవద్దని, సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. శనివారం చేబ్రోలు ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలకు ఏ వ్యాధి వచ్చినా ఆరోగ్య సిబ్బందికి వార్డెన్ తెలియజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వారానికి ఒక రోజు ఐరన్ మాత్రలు పిల్లలు వేసుకోవాలన్నారు. వసతి గృహ పరిసరాల్లో డ్రైడే పాటించాలన్నారు. వసతి గృహం సంక్షేమ అధికారిణి కె.మారాబాయ్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి కె.రత్న రాజ్యం పాల్గొన్నారు.

జ్వరాల వ్యాప్తిపై అప్రమత్తం

దెందులూరు: కొవ్వలిలో జ్వరాల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ శర్మిష్ఠ, దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్. కృపావరం, వైద్యులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. కొవ్వలిలో 50 మందికిపైగా, దెందులూరులో జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్న సంగతి విదితమే. గ్రామస్తుల కోరిక మేరకు కొవ్వలిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పోతునూరు వైద్యశాల సిబ్బంది బాధితులకు వైద్య సేవలందించారు. అనంతరం గోపన్నపాలెం పీహెచ్‌సీని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్.కృపావరం, తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీఓ వీ.శ్రీలత పాల్గొన్నారు.

అసమానతలపై చిన్నం అయ్యన్న పోరాటం ఆదర్శం

గణపవరం: సమాజంలోని అసమానతలపై చిన్నంఅయ్యన్న పోరాటం ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, దిగుబాటి రాజగోపాల్ అన్నారు. శనివారం గణపవరం మండలం అర్ధవరంలో మాజీ సర్పంచ్, కమ్యూనిస్టు నాయకుడు చిన్నం అయ్యన్న సంతాప సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు, అధ్యక్షుడు బత్తుల విజయకుమార్, సీపీఎం మండల కార్యదర్శి పెచ్చెట్టి నర్సింహమూర్తి పాల్గొన్నారు.